# హనీమూన్

జీడిగుంట రామచంద్రమూర్తి



అయిదయింది....

ఆఫిసులోంచి బయట కొచ్చిన మోహనరావు కర్చీఫ్‌తో ముఖం తుడుచుకున్నాడు. జేబులో వున్న చిన్న దువ్వెన తీసి తల దువ్వుకున్నాడు. ఆ తర్వాత ప్యాంటు జేబులో చేతులు పెట్టుకున్నాడు. కుడి జేబులో వున్న రూపాయల కట్ట చేతికి మెత్తగా తగిలింది. బొచ్చుకుక్కపిల్ల తలను నిమిరినట్లు ఆ రూపా

యల కట్టను ఓసారి ఆప్యాయంగా నిమిరేడు జేబులోనే.

ఎదురుగా వున్న హోటల్లోకి నడిచేడు. కానీ ఏమీ తినాలనిపించలేదు. అదేం విచిత్రమో కానీ, తాను చాలాసార్లు గమనిస్తూనే వున్నాడు.... జేబులో పుష్టిగా డబ్బున్నప్పుడు ఏమీ తినాలనే అనిపించదు. డబ్బులకు కొరత ఏర్పడినప్పుడే జిహ్వా చాపల్యం మరీ మితి మీరుతుంది.

అందుకే అన్నారు కాబోలు—'దరిద్రుడికి ఆకలెక్కువా డబ్బున్నవాడికి ధైర్యం ఎక్కువా' అని.

ఎలాగా హోటల్లోకి వచ్చినందుకు, కేవలం గ్లాసుడు మంచినీళ్ళు తాగి వెళ్ళిపోతే మర్యాదకు భంగమని కప్పు కాఫీ తాగి బిల్లు చెల్లించాడు. ఇంటికి వెళ్ళే దారిలో పది రూపాయలు పెట్టి స్వీట్లు కొన్నాడు. ఓ రెండు రూపాయలు పెట్టి మల్లెపువ్వులు కొన్నాడు.

ఇంటికి చేరగానే హాల్లో ఎదురయిన అమ్మ చేతిలో ఆ స్వీట్స్ ప్యాకెట్ పెట్టేడు మోహనరావు.

మల్లెపువ్వుల్ని మాత్రం జాగ్రత్తగా తన గదిలో దాచిపెట్టి— ఆ రాత్రి భోజనాలయ్యాక, తన దగ్గరకు వచ్చిన నీరజ చేతికి అందించాడు. మళ్ళీ వాటిని భర్త చేతిలోనే పెట్టి తాను వెనక్కి తిరిగి నిలబడింది నీరజ.

"ఇవాళ మాకు బోనస్ ఇచ్చారోయ్" అన్నాడు మోహనరావు, ఆ మల్లెచెండును తన భార్య తలలో పెడుతూ.

"అలాగా! ఎంతిచ్చారూ?" వుత్సాహంగా అడిగింది నీరజ.

మోహనరావు చెప్పేడు.

"రేపు ఆఫీసుకు సెలవు పెట్టేను. మనిద్దరం రేపు మధ్యాహ్నం షాపింగ్‌కి వెడదాం. నీకు ప్రెజెంటేషన్ ఏం కావాలో కోరుకో; కొంటాను. ఆ తర్వాత హోటల్లో టిఫిన్ తిని 'ఫస్టు షో' సినిమాకి వెడదాం.... సినిమా అయ్యేక హోటల్లోనే భోంచేసి ఇంటికొద్దాం" భార్య నడుం చుట్టూ చేతులు బిగించి మీదకు లాక్కుంటూ అన్నాడు మోహన్‌రావు.

"నాకేం ప్రజెంటేషన్ అక్కర్లేదులెండి" చిరుకోపం ప్రదర్శించింది నీరజ.

నీరుకారిపోయాడు మోహనరావు.

"అదే మీ ఆడవాళ్ళతో వచ్చింది; మొగుడు సరదాగా వున్నప్పుడు, ఆ సరదాలో పాలు పంచుకోవాలనీ, హుషారుగా వుండాలనీ అనుకోరు! నిప్పులమీద నీళ్ళు చల్లినట్లు ఆనందాన్ని ఆర్పిపారేస్తారు" సిగరెట్ వెలిగించుకుని చిరు విసుగు ప్రదర్శించేడు.

"అవును! ఎంతసేపూ మీ సరదాల్లో పాలుపంచుకోవటం — పట్టెమంచం దగ్గరకు పాలగ్లాసుతో తయారవటం—మీ సరదాలు తీర్చటం—ఇవి తప్ప మా సరదాలు మీకేం పట్టవ్." నిష్ఠూరంగా అన్నది నీరజ.

"నీ సరదా నేనేం కాదన్నాను చెప్పు?"

"మన పెళ్ళయి రెండేళ్ళు కావస్తోంది.... ఈ రెండేళ్ళనుంచీ 'హనీమూన్‌కి వెడదామండీ' అని, కనీసం ముప్పయి మూడు సార్లయినా అడిగేను. తీసుకెళ్ళేరా?.... డబ్బుంటే శలవు దొరకదు....శలవు దొరికితే డబ్బుండదాయె! రెండూ కలిసొస్తే మరో అవాంతరం. మా శ్యామల్ని పెళ్ళి చేసుకున్న మూడో రోజునే వాళ్ళ మొగుడు, మైసూరూ ఊటీ తీసుకెళ్ళేడు ఇంచక్కా!" మంచంమీద, భర్తకి దూరంగా జరిగి కూర్చుంది.

మోహన్‌రావుకి విషయ యేమిటో అర్థమైంది.

నిజమే!

అసలు తమ పెళ్ళయిన నాలుగో రోజునే భార్యను తీసుకుని ఢిల్లీ వెడదామనుకున్నాడు తను. కానీ సరిగ్గా అప్పుడే వాళ్ళ నాన్నకి గుండెపోటు రావటం, ఆస్పత్రిలో ఎడ్మిట్ కావటం, బోలెడంత ఖర్చు కావటం జరిగేయి. ఎలాగో యిరవై రోజులు ఆస్పత్రిలో వున్నాక—తిరిగి క్షేమంగా ఇంటికొచ్చేడాయన. ఆ తర్వాత రెండు మూడుసార్లు— వెళ్ళాలని ప్రయత్నం చేసినా ఏదో ఒక ఆటంకం రానే వచ్చింది.

తన మరదలు శ్యామలకి యీ మ ధ్య నే పెళ్ళయింది....పెళ్ళయిన మూడో రోజునే, శ్యామలా, వాళ్ళాయనా, హనీమూన్ పేరుతో హాయిగా పదిరోజులు తిరిగివచ్చేరు.

నీరజ కూడా అలాంటి ముచ్చట తీర్చుకోవా లనే కోరిక కలగటంలో ఆశ్చర్యం యేముం టుంది? అసలు అంతవరకూ యెందుకూ? పెళ్ళి కాని క్రితం తనమటుకు తాను ఎన్ని ముచ్చట్లు తీర్చుకోలేదూ? పైగా యింట్లో తల్లీ, తండ్రీ, తమ్ముడూ, చెల్లెలూ ఇంతమంది ఉండటంతో-ఓ సరసమాడుకోవటానికీ—ఓ సరదా తీర్చు కోవటానికీ సరైన అవకాశమే దొరకదాయె! అన్ని పనులూ యాంత్రికంగా జరిగి పోతూంటే, యిక జీవితంలో థ్రిల్లేముం టుందీ?....

అలా అయిదారు నిముషాలు సీరియస్‌గా ఆలోచించిన తర్వాత మోహన్రావ్ ఒక నిర్ణ యానికి వచ్చాడు.

"ఆల్‌రైట్! రేపే మన ప్రయాణం'.... గెట్ రెడీ!" అన్నాడు, హుషారుగా భుజం తట్టి....

నీరజ కళ్ళు ఆనందంతో మెరిసేయి.

అప్పుడు కానీ ఆ గదిలో 'బెడ్‌లైట్' వెలగలేదు.

హనీమూన్‌కి వెడుతున్నట్టు యింట్లో చెప్ప టానికి కొంచెం యిబ్బంది పడ్డాడు మోహ న్రావు....తిరుపతిలో గల ఫ్రెండ్ పెళ్ళికి వెడు తున్నట్టుగా కోసి, ఆ మర్నాడు పొద్దున్నే భార్యతోసహా రైలెక్కేడు.

సాయంత్రం నాలుగయ్యేసరికి యిద్దరూ విజయవాడ చేరుకున్నారు. అక్కడ ఓ మంచి హోటల్లో ఆ రాత్రి గడిపి మర్నాడు మదరాసు వెళ్ళాలని అతని ఉద్దేశం!

కానీ వాళ్ళకి హోటల్లో 'రూం' దొరకటమే గగనమయిపోయింది. ఒకటి రెండు హోటల్లో కనీసం—'సింగిల్‌రూం' కూడా ఖాళీ లేక పోయింది. మరో రెండు మూడు చోట్ల డబుల్ రూములువున్నా ిమ కివ్వటానికి వాళ్ళెందుకో సందేహిస్తున్నారనే అనుమానంకూడా వచ్చింది మోహన్రావుకి.

అలా తిరగ్గా తిరగ్గా చిట్టచివరకి—ఓ హోటల్లో—

"ఓ గంటసేపు వెయిట్‌చేస్తే డబుల్‌రూం ఖాళీ అవుతుంది....ఇస్తాం!" అన్నారు. ఆ గంటసేపూ పడిగాపులు గాయక తప్పలేదు.

మొత్తానికి రాత్రి ఏడయ్యేసరికి ఆ రూంలో సెటిలయ్యేరు మోహన్‌రావూ నీరజా!

"ఇవాళ రాత్రి అసలు మనం నిద్రపోవ టానికి వీల్లేదు .... హాయిగా కబుర్లు చెప్పు కుందాం!" అన్నాడు మోహన్‌రావు వేణ్ణీళ్ళ స్నానం చేసివచ్చేక లుంగీ కట్టుకుంటూ.

నీరజ మాట్లాడలేదు. భర్తవైపు కొంటెగా చూసి చిలిపిగా నవ్వింది. ఆమె చూపులోనూ, నవ్వులోనూ కనిపించిన మత్తుతో, అంతకు ముందు 'రూం'కోసం తాను పడిన శ్రమనంతా మరచిపోయేడు మోహన్రావు.

మరికొంతసేపటికి నీరజకూడా స్నానంచేసి వచ్చింది. తెల్లటి వాయిల్‌చీర తీసి కట్టుకుంది. జడ వదులుగా అల్లుకుని అంతకుముందు స్టేషన్లో కొనుక్కున్న మల్లెపూల దండ తీసి జడలో తురుముకుంది.

అంతవరకూ బెడ్ మీద పడుకుని భార్యవైపే తదేకంగా చూస్తున్న మోహన్రావుకి—ఆ క్షణాన, ఆమెలో ఏదో కొత్త ఆకర్షణ కని పించి పులకింపచేసింది. ఫేనుగాలి వల్ల, ఆ గదినిండా వ్యాపించిన మల్లెపూల పరిమళం అతని ఊహలకి పదును పెట్టింది.

చటుక్కున లేచి—భార్యదగ్గరకు వచ్చేడు. ఆమె ముఖాన్ని తన రెండు చేతుల్లోకి తీసు కుని—పెదాలమీద ముద్దు పెట్టుకున్నాడు.


నీరజ ఉక్కిరిబిక్కిరయింది.

"ఛీ....పాడు! అన్నింటికీ తొందరే!" విది లించుకుంటూ అంది.

"తొందర కాదు! స్వేచ్ఛ! ఇంట్లో అయితే యిలాంటి అవకాశం యెలాగా దొరకదు!" అంటూ బజర్ నొక్కేడు.

బోయ్ వచ్చి నిలబడ్డాడు.

"తొందరగా వెళ్ళి ఓ హాఫ్ బ్లాక్‌నైట్




విస్కీ తీసుకురా! రెండు మీల్స్ కూడా!" ఆర్డరిచ్చి; వాడి చేతిలో మూడు పదినోట్లు పెట్టేడు.

బోయ్ వెళ్ళిపోయేడు.

"విస్కీ ఎందుకూ?" భర్తవైపు కొత్తగా చూస్తూ అనుమానంగా అడిగింది.

"తాగటానికి!"

ఆ జవాబు విన్న నీరజ కళ్ళల్లో క్షణంసేపు భయంలాంటిది మెదిలింది.

"మీరు తాగుతారా?" అడిగింది.

"ఎప్పుడైనా!....మన పెళ్ళి కాని క్రితం, నేను కొంతకాలం మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పని చేశానులే! అప్పట్లో క్యాంప్స్‌కి వెళ్ళినపుడు, అప్పుడప్పుడు తాగేవాణ్ణి! ఆ తర్వాత ఆ ఉద్యోగాన్ని వదిలేయటంతో ఆ ఛాన్సూ పోయింది."

"తాగటం కూడా ఛాన్సే నేమిటి? సిగ్గు లేకుండా ఇంకా చెప్పుకుంటున్నారు!"

"అవకాశం వచ్చినప్పుడు తాగటంలో తప్పు లేదన్నారు!"

"ఎవరూ అలా అన్నది?"

"సుబ్రమణ్యం అనీ, నా ఫ్రెండొకడుండే వాడు! నే నెప్పుడు తాగినా వాడే నాకు తోడు! అయినా ఒక్కళ్ళూ బిక్కు బిక్కుమంటూ కూర్చుని, దొంగచూపులు చూస్తూ తాగాలంటే బోర్!....'కంపెనీ' వుంటేనే బాగుంటుంది! యెంతసేపయినా హాయిగా కబుర్లు చెప్పుకుంటూ తాగచ్చు!" సిగరెట్ వెలిగించుకుంటూ చెప్పేడు మోహన్రావ్.

"మరి మీకిప్పుడు తోడెవ రొస్తారో?.... ఆ బోయ్‌గాణ్ణి కూర్చోబెట్టుకుంటారా పక్కన?" కోపంగా అడిగింది నీరజ.

"నువ్వున్నావుగా!" బెడ్ మీద ఆమె పక్కనే కూర్చుంటూ అన్నాడు.

త్రుళ్ళిపడింది నీరజ.

"నేనా!...." భయంగా చూసింది భర్త వైపు.

"అవును! ఏం భయంలేదు....చాలా బాగుంటుంది. లైట్‌గా తీసుకుందువు గాని!" తాపీగా సిగరెట్టు పొగ వదుల్తూ అన్నాడు.

"నేను మాత్రం చస్తే తాగను!" బెడ్ మీద నుంచి లేచిపోయి దూరంగా వున్న కుర్చీలో కూర్చుంది.

మోహన్‌రావ్ నవ్వుకున్నాడు.

మరికొన్ని నిమిషాలకు బోయ్ 'మీల్స్' తీసుకొచ్చాడు. విస్కీబాటిల్ కూడా బల్లమీద

పెట్టి వెళ్ళిపోయేడు.

ఓ గాజు గ్లాసులో కాస్త విస్కీ—పోసి— నిండా నీళ్ళు నింపేడు మోహన్రావు. భార్య ముందు ప్రతాపం చూపిస్తున్న వీరునిలా దాన్ని రెండుగుక్కల్లో తాగేశాడు. ఖాళీ అయిన గ్లాసులో మళ్ళీ—మరి కాస్త విస్కీ పోసుకుంటూ—

"నువ్ భోజనం చేసెయ్—" అన్నాడు.

అంతవరకూ భర్తను నిశితంగా గమనిస్తున్న నీరజ—

"ఏం—మీరు భోంచెయ్యరా?"— అని అడిగింది.

"ముందీ మందు! ఆ తర్వాతనే విందు! అదీ ప్రొసీజరు" మళ్ళీ మరో సిగరెట్ వెలిగించేడు మోహనరావు.

"మీరిలా తాగుతారని తెలిస్తే అసలు ఈ హనీమూను ప్రసక్తే తేకపోయేదాన్ని!" నిష్ఠూరంగా అంది నీరజ.

"నువ్ మరీ అలా ఫీలయిపోవడం నాకేం నచ్చలేదు నీరూ! ఇపుడేమయిందని అంత సీరియస్సయిపోతావ్? స్వేచ్ఛ దొరికినప్పుడు హాయిగా యిలా ఎంజాయ్ చెయ్యటంలో తప్పేముందీ? ఎప్పుడో చాలాకాలం క్రితం తాగేను. మళ్ళీ ఇప్పుడు తాగాలని అనిపించింది. దట్సాల్! అంతమాత్రంచేత నేనేం తాగుబోతునయిపోను....అయినా తాగిం తర్వాత ఎంత బాగుంటుందో నీకు తెలీదు....అందుకే నిన్ను కూడా కొంచెం తీసుకొమ్మని రిక్వెస్టు చేస్తున్నాను....ఇది ఓ టానిక్....తెలుసా?....తాగిన తర్వాత ఆకలి బాగా పుడుతుంది. మన పల్లెటూళ్ళలో చంటిపిల్లలకి ఉగ్గు ఎలా పోస్తారో ఫారెన్ కంట్రీస్‌లో చిన్నపిల్లలకి ఈ 'మందు' అలా పోస్తారట....అంతవరకూ ఎందుకూ! మన దేశంలో ఎంతోమంది లేడీస్ కూడా తాగుతారు. సినీమాల్లో యాక్టుచేసే ఆడవాళ్ళెందరో తాగుతారట. సుబ్బరమణ్యం చెప్పేడు."

తాగిన మందు కొంచెం తలకెక్కటంతో మోహన్‌రావుకి ఉపన్యాస ధోరణి మొదలయింది.

"ఇందులో కొంచెం ఇపుడు నువ్ కూడా తాగాలి" విస్కీ వున్న గ్లాసులోకి, మళ్ళీ నీళ్ళు పోస్తూ అన్నాడు.

"నేను చచ్చినా తాగను!" కళ్ళనీళ్ళపర్యంతమవుతున్న నీరజ మొండిగా చెప్పింది.

"నువ్ తాక్కపోతే నామీద ఒట్టే! కమాన్!" లేచి ఆమె దగ్గరకు వస్తూ అన్నాడు.

భయంతో వణికిపోయింది నీరజ.

"ఛ! నువ్వింత పిరికిదానివనుకోలేదు నీరూ" తన కుడి చేతిని ఆమె నడుం చుట్టూ గట్టిగా బిగించి, దగ్గరకు లాక్కుని నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు.... ఆ తర్వాత ఓ అడుగు వెనక్కు వేసి మళ్ళీ అన్నాడు—

"నామీద ఒట్టన్నా నీకు లక్ష్యం లేదుకదూ! పోన్లే....నేనేమైపోతే నీకేం! నీ సుఖం నువ్ చూసుకో! మొగుడి సరదా తీర్చటానికి ఇంత బాధపడిపోతావని అనుకొని వుంటే, అసలీ హనీమూన్‌కి వచ్చేవాడ్నేకాదు.... మనూరి కాఫీ హోటల్లో రవ్వదోసె తినేసి, ఓ సినిమా చూసేసి ఇంటికి పోయేవాళ్ళం....అసలు హనీమూన్ అంటే నీకు అర్థం తెలీదు నీరూ! అంతే!—"


అయినా నీరజ బదులు చెప్పలేదు. తల ఒంచుకుంది. ఆ మౌనాన్ని అందులో కనిపించే రాజీ ధోరణినీ అర్థం చేసుకున్న మోహన్‌రావు మరి కొంచెం యెడ్వాన్సయ్యేడు.

"ఆనాడు సావిత్రీ, సుమతీ, సీతా, అనసూయా మొదలైన మహా పతివ్రతలంతా తమ తమ మొగుళ్ళకోసం యెన్నెన్నో త్యాగాలు చేసేరు....అలాంటివాళ్ళ కథలు చదివి— 'ఆహా ఓహో' అంటే సరిపోదు! మొగుడు గాడు ముచ్చటపడి ఓ చిన్న కోరిక కోరితే దాన్ని ధైర్యంగా తీర్చగలగాలి!"

భర్త ధోరణి నీరజకు బాధ కలిగించింది. తాను తాగక తప్పదనుకుంది.

"చేదుగా వుంటుందా?" విస్కీ వున్న గ్లాసు వైపు భయం భయంగా చూస్తూ అడిగింది.

"ఛ! చేదుగా వుంటే నేను మాత్రం తాగుతానా? కమ్మగానే వుంటుంది. మొట్టమొదటి



గుటక పడేవరకూ ఓరు చేదున్నా—ఆ తర్వాత చాలా బాగుంటుంది!" గ్లాసు ఆమె చేతికి అందిస్తూ అన్నాడు.

అందులో వున్నదాన్నంతా ఒకే గుక్కలో తాగేసింది నీరజ....ఆ తర్వాత గొంతు మండి నట్లయితే మరో గ్లాసుడు మంచినీళ్ళు కూడా తాగింది.

ఆమె ధైర్యాన్ని అభినందించేడు మోహన్ రావు. భార్యంటే అలా వుండాలని మెచ్చుకున్నాడు. సీసాలో మిగిలిన విస్కీనంతా మళ్ళీ గ్లాసులో పోసి నీళ్ళతో నింపేడు.

"ఇది కూడా ఫినిష్ చేసేస్తే, భోజనం చేసేయచ్చు!" అన్నాడు!

"అది కూడానా?....నాకొద్దు!" దూరంగా జరిగింది.

అయినా ఆమెకు తప్పలేదు....భర్త బలవంతం మీద మరికాస్త తీసుకుంది.

ఇద్దరూ ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేసేరు.

బోయ్ వచ్చి ఖాళీ అయిన ప్లేట్లూ, గ్లాసులు తీసుకుపోయేడు.

"ఇప్పుడెలా వుంది?" మంచం మధ్య అడ్డంగా పడుకున్న భార్యను తన కౌగిట్లోకి లాక్కుంటూ అడిగేడు.

నీరజ ఏదో చెప్పింది. ఆమె కనురెప్పలు బరువుగా మూతలు పడుతున్నాయి. మాటలు ముద్దగా వస్తున్నాయి. అవేం మోహన్ రావుకి వినిపించటం లేదు. భార్యలోని అందాలు, మత్తెక్కిన అతని కళ్ళకు పదింతలుగా కనిపించి పరవశుణ్ణి చేస్తున్నాయి.

సరిగ్గా అదే క్షణంలో బెల్ మోగింది.

ఎవరో బయటనుంచి బజర్ నొక్కుతున్నారు.

విసుక్కుంటూ వెళ్ళి తలుపు తీసేడు మోహన్ రావు....ఎదురుగా వున్న పోలీసుల్ని చూసి క్షణంపాటు దిగ్భ్రాంతుడయ్యేడు.

"క్షమించాలి! ఈ హోటల్ రూమ్స్‌లో గేంబ్లింగూ, వ్యభిచారం జరుగుతున్నాయని మాకు రిపోర్ట్సు వస్తున్నాయి" అంటూ ఇన్‌స్పెక్టర్ లోపలకు వచ్చాడు. అతని వెనక మరో ఇద్దరు కానిస్టేబుల్స్ కూడా వచ్చేరు.

మోహనరావ్‌కి మైకం పూర్తిగా దిగిపోయింది.

ఇన్‌స్పెక్టర్ నీరజ దగ్గరగా వచ్చాడు.

భయంగా లేచి నిలబడిన నీరజ పమిటను భుజాలమీదుగా కప్పుకుంది.

"ఎవరు నువ్?" అడిగేడు ఇనస్పెక్టర్, ఆమెవైపు తీక్షణంగా చూస్తూ.

"షీ ఈజ్ మై వైఫ్!" మోహన్రావ్ వెంటనే బదులు చెప్పేడు.

నవ్వేసేడు ఇనస్పెక్టర్.

"లాడ్జిలకు అమ్మాయిల్ని తీసుకొచ్చే— మీలాంటివారంతా ఆ మాటే చెప్తారు.... ఇలాంటి కేసుల్ని నా సర్వీసులో చాలా చూసేను మిస్టర్!" అన్నాడు.

మోహనరావ్‌కి కోపం వచ్చింది. అయినా తమాయించుకున్నాడు. తన గురించీ, తన వాళ్ళ గురించీ, తన వుద్యోగం గురించీ చెప్పుకున్నాడు....హనీమూన్‌కి వచ్చిన విషయం చెప్పేడు. భార్య మెడలో వున్న మంగళ సూత్రాన్నీ, కాలివేళ్ళకున్న వెండి మట్టెల్నీ కూడా చూసుకోమన్నాడు.

అయినా ఇన్‌స్పెక్టర్‌కి నమ్మకం కుదరలేదు. లాడ్జిలకు తయారయ్యే అమ్మాయిలు చాలామంది ఇప్పుడు అలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నాడు. ఆ విధంగా వచ్చే ఆడవాళ్ళే తాగుతారన్నాడు. చెప్పుకోవలసిందేదయినా వుంటే కోర్టులో మెజిస్ట్రేటు ముందు చెప్పుకోమన్నాడు.

మోహన్‌రావుకి ఏడుపొచ్చినంత పనైంది. నీరజకయితే ఏడుపొచ్చేసింది.

వాళ్ళ ఏడుపు మొహాలు చూసిన ఇనస్పెక్టర్‌కి జాలేసింది.

"పోనీ ఈ ఊళ్ళో మీకు తెలిసిన వాళ్ళెవరయినా వున్నారా?" అని అడిగేడు.

అప్పటికిగానీ కర్తవ్యం బోధపడలేదు మోహన్‌రావ్‌కి. సుబ్బరామయ్య అనే, వాళ్ళ నాన్న స్నేహితుడొకాయన ఆ వూళ్ళో లాయరుగా వుంటున్న సంగతి చటుక్కున జ్ఞాపకం వచ్చింది. తమ పెళ్ళిలో మోహన్‌రావ్ ఆయనను చూసేడు కూడా. ఆ సంగతే ఇన్‌స్పెక్టర్‌కి చెప్పి, తన డైరీలో వున్న ఆయన ఫోన్ నెంబర్ యిచ్చేడు.

వెంటనే ఇన్‌స్పెక్టర్ సుబ్బరామయ్యకు ఫోన్ చేసేడు.

అంత రాత్రివేళ ఫోనేమిటోనని ఖంగారు పడుతూనే ఫోనెత్తేడు సుబ్బరామయ్య.

"మీరు అర్జంటుగా హోటల్‌కి రావాలి! ఇక్కడ రూం నెంబర్ తొమ్మిదిలో వున్న మోహనరావ్‌ని గుర్తుపట్టాలి!" చెప్పేడు ఇన్‌స్పెక్టర్.

అవతల నుంచి మాట్లాడుతున్న సుబ్బరామయ్యకి అర్థం కాలేదు.

మోహన్‌రావు వూరి పేరూ, తండ్రి పేరూ, వివరాలూ చెప్పేడు ఇన్‌స్పెక్టర్.

"అయ్యో! ఆ మోహన్‌రావా!....అతను తెలీకేం? వాళ్ళ నాన్నా నేనూ ప్రాణస్నేహితులం! పాపం....పెళ్ళయి యింకా రెండేళ్లు కూడా కాలేదు... అందమైన పెళ్ళాముంది.... బంగారంలాంటి వుద్యోగం వుంది. మరి ఆత్మహత్య ఎందుకు చేసుకున్నాడో?" అవతల నుంచి సుబ్బరామయ్య మాటల్ని విన్న ఇన్‌స్పెక్టర్ త్రుళ్ళిపడి అన్నాడు—

"ఛ! ఛ! అదేం కాదండీ! ఆతను హాయిగానే వున్నాడు. మీరు ఓసారి రండి! కేసేమిటో అర్థమవుతుంది. వెంటనే వెళ్ళిపోదురుగాని!" అని ఫోను పెట్టేసేడు.

మరో అరగంటకల్లా సుబ్బరామయ్య వచ్చేడు....విషయం తెల్సుకుని నవ్వేశాడు.

"హడలగొట్టేశారుకదండీ! కేసనీ, గుర్తుపట్టటం అనీ మీరు చెప్పగానే నేను ఖంగారు పడిపోయాను" అన్నాడు నవ్వుతూనే.

మోహన్‌రావూ, నీరజా తనకు తెలుసుననీ, వాళ్ళిద్దరూ భార్యాభర్తలేననీ, సుబ్బరామయ్య చేత రాయించుకుని వెళ్ళిపోయేడు ఇన్‌స్పెక్టర్.

"అయినా బెజవాడ వచ్చినవాళ్ళు హాయిగా మనింటికి రాకుండా యీ హోటల్లో భాగోతం యేమిటోయ్?" అని మెత్తగానే చివాట్లువేసేడు ఆయన.

నీరజ సిగ్గుతో తల వంచుకుంది.

"జరిగిందేదో జరిగిపోయింది. ఈ సంగతి మా నాన్నగారికి తెలియనివ్వకండి!", సుబ్బరామయ్య వెళ్ళిపోతుంటే మోహన్‌రావ్ ప్రాధేయపూర్వకంగా అన్నాడు.

"ఛీ! దరిద్రపు గొడవ! సిగ్గు కూడానూ, హోటల్లో యిలాంటి రైడింగులు జరుగుతాయని తెలిస్తే—నేను అసలు యిక్కడ ఉండేదాన్నే కాదు. సమయానికి ఆయ నెవరో—దేవుడిలా వచ్చారు కనక సరిపోయింది.... లేకపోతే యెంత రభస జరిగేదో?" తలుపులు వేసి వచ్చిన భర్తతో అంది నీరజ.

"ఒక్కొక్కసారి అలాగే జరుగుతూంటుంది నీరూ! యేం చేస్తాం? అయినా నీతికీ నిజాయితీకీ రోజులు కావు! మోసం చేసేవాడెపుడూ ముందు జాగ్రత్తలు తీసుకుంటూనే వుంటాడు. అంతవరకూ ఎందుకు? రెండేళ్ళక్రితం ఓసారి సుబ్రమణ్యం ఈ హోటల్లోనే 'రూం' తీసుకుని—ఓ అమ్మాయిని తెచ్చుకున్నాడు.... తెలుసా?" మంచినీళ్ళు తాగుతూ అన్నాడు మోహన్‌రావు.

"మరి అప్పుడు పోలీసులు రాలేదా?...." అమాయకంగా అడిగింది.

"అప్పుడు కూడా వచ్చేరు. కానీ వాణ్ణి అనుమానించలేదు!"

"ఎందుకనీ?"

"అసలు అలాంటి అమ్మాయిల్ని సప్లయి చేయటానికి కొందరు బ్రోకర్లుంటారు. వాళ్ళే అమ్మాయిలతోబాటు చిన్న పిల్లల్ని కూడా సప్లయి చేస్తారు....ఎవరి రేటు వాళ్ళకుంటుంది. ఆ రోజున కూడా యిలాగే పోలీసులు వచ్చినప్పుడు—ఆ అమ్మాయి తన పెళ్ళామనీ—అక్కడే వున్న రెండేళ్ళ కుర్ర వెధవ తన కొడుకనీ—కనకదుర్గ గుళ్ళో మొక్కు తీర్చుకునేందుకు వచ్చేమనీ కోసేడు!....అంతే! పోలీసులు మారు మాట్లాడకుండా వెళ్ళిపోయారు! అసలు మనం కూడా అయిదో పదో పారేసి ఓ పిల్లాడ్ని అద్దెకు తెచ్చుకోవాల్సింది!"

"అలా బతికేవాళ్ళు కూడా వుంటారన్న మాట!" ఆశ్చర్యపడుతూ అంది నీరజ.

"ఏం చేస్తారు మరి? కూటికోసం కోటి విద్యలన్నారు!" గొప్పగా చెప్పేడు మోహన్ రావ్.

"ఇంతకీ సుబ్రమణ్యం కథంతా మీకెలా తెలుసు?" ఓ నిమిషం తర్వాత యథాలాపంగా అడిగింది.

"ఎలా తెలుసంటే... యెలా తెలుసేమిటీ నీ మొహం!....వాడు నా ఫ్రెండని చెప్పేనుగా! వాడే చెప్పాడు యీ కథంతా!" తత్తరపడుతూ అన్నాడు.

"పోన్లెండి. అలాంటి లక్షణాలు మీకు ఒంటబట్ట లేదు!...." అంది నీరజ—తృప్తిగా నిట్టూర్చి.

నిజంగా తన భర్తకి సుబ్రమణ్యం అనే పేరుగల స్నేహితుడు యెవడూ లేడనీ—రెండేళ్ళ క్రితం జరిగిన తన అనుభవాన్నే సుబ్రమణ్యానికి అన్వయించి చెప్పేడనీ ఆ అమాయకురాలికి యిప్పటికీ తెలీదు పాపం! □


దీపావళికి ముందే

దీపావళి

జ్యోతి దీపావళి ప్రత్యేక సంచిక '79

మీ కాపీ రిజర్వు చేసుకోండి!